క్లుప్తంగా

విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉండాలి


ఎల్లారెడ్డిపేట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పిల్లలు, యువత విద్యుత్ తీగల సమీపంలో పతంగులు ఎగురవేయవద్దని సెస్ ఏఈ దివ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని సెస్ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ.. కరెంటు స్తంభాలు, విద్యుత్ తీగలు లేని విశాలమైన ప్రదేశాల్లో పతంగులను ఎగురవేయడం సురక్షితమన్నారు. పిల్లలు గాలిపటాలను ఎగురవేసే సందర్భంలో పెద్దలు వారితో ఉండాలన్నారు. గాలిపటాలు విద్యుత్ తీగలకు చుట్టుకుని ప్రమాదాల జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఎగురవేయాలని కోరారు.

అర్హులైన బీడీ కార్మికులకు పింఛన్లు


సన్మానిస్తున్న నాయకులు

ముస్తాబాద్: సీఎం కేసీఆర్ త్వరలోనే అర్హులైన బీడీ కార్మికులందరికీ పింఛన్లు ఇస్తారని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. ముస్తాబాద్ ఏఎంఆర్ గార్డెన్స్‌లో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డిని తెలంగాణ బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం, బీడీ కార్మిక సంఘం శనివారం ఘనంగా సన్మానించింది. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, 2014 తర్వాత పీఎఫ్ ఉన్న కార్మికులను ప్రభుత్వం గుర్తించిందన్నారు. సంఘం అధ్యక్షుడు బద్దెపూరి శ్రీనివాస్, రంగయ్య, కొంక రాజు, యూసుఫ్, వై.రాజు, టి.బాబు, ప్రభాకర్, మాదాసు యాదగిరి, వంగరి యాదగిరి, సుమలత, భారతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో పందుల స్వైరవిహారం


గొల్లపల్లిలో పందుల సంచారం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులకు పాలకవర్గానికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు, కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పందులు తరచూ ఇళ్లలోకి వచ్చి వస్తువులను పాడు చేస్తున్నాయని వాపోతున్నారు. పందుల విహారంతో రోగాలబారిన పడుతున్నామని, దీనిపై పాలకవర్గ సభ్యులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని పందుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

చెట్టుపై నుంచి పడి పశువులకాపరి మృతి

ముస్తాబాద్: గొర్రెలు, మేకలకు మేత కోసం చెట్టు ఎక్కిన ఓ పశువుల కాపరి ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి దుర్మరణం చెందాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన మందాడి ఆశయ్యయాదవ్(55) శనివారం గ్రామ శివారుకు మేకలు, గొర్రెలను తీసుకెళ్లాడు. వాటికి మేత కోసం చెట్టు ఎక్కి, కొమ్మలు నరుకుతుండగా కాలుజారి కిందపడిపోయాడు. ఆశయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో రక్తస్రావమైంది. స్థానికులు ఆశయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. పండుగ రోజు ఆశయ్య మృతితో గూడెంలో విషాదం చోటుచేసుకుంది. మృతునికి భార్య భూలక్ష్మి, కుమారులు నాగరాజు, ప్రశాంత్, మహేశ్, కుమార్తె పద్మ ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కరీంనగర్ పట్టానికి చెందిన లేగల రామ్‌రెడ్డి శనివారం సొంత పనుల మీద బైక్‌పై రాచర్ల గొల్లపల్లికి వచ్చి వెళ్తుండగా రాగట్లపల్లి మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ సంఘటనలో తలకు బలమైన గాయాలు కాగా, స్థానికులు 108లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కార్యవర్గం

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు పసుల వెంకటి ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ అధ్యక్షుడిగా మంజూరలీ, ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, కార్యదర్శి అంజయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కనుకయ్యగౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్, మైనార్టీసెల్ అధ్యక్షుడు పశువొద్దీన్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెంకటవ్వ ఎన్నికైనట్లు తెలిపారు.


వేములవాడ అర్బన్: కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


ముస్తాబాద్: మద్దికుంటలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు


ఎల్లారెడ్డిపేట: ప్రత్యేక అలంకరణలో గోదారంగనాథ స్వాములు

కల్యాణ వైభోగమే..

వేములవాడ రాజన్న అనుబంధ నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్చకులు గోదారంగనాథుల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. కన్యాదాతలుగా రామాచారి, సంధ్యారాణి వ్యవహరించారు. బోయినపల్లి మండలం తడగొండ, విలాసాగర్ గ్రామాల్లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల్లో నిర్వహించిన వేడుకల్లో సర్పంచులు చిందం రమేశ్, జూలపల్లి స్వప్నాంజలి పాల్గొన్నారు. ముస్తాబాద్ మండలం మద్దికుంట శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. గోపాల్‌రావు భక్తులకు అన్నదానం చేశారు. ఎంపీపీ శరత్‌రావు, సర్పంచ్ భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఇల్లంతకుంట మండలం రేపాక శ్రీసీతారాములస్వామి ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణాన్ని పండితులు కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం నుంచి దత్తత ఆలయమైన రామాలయానికి పట్టు వస్త్రాలను అందజేశారు. సర్పంచ్ నిమ్మ లక్ష్మి, నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ మహేందర్ భక్తులు పాల్గొన్నారు.

– వేములవాడఅర్బన్/బోయినపల్లి/ముస్తాబాద్/ఇల్లంతకుంట/ఎల్లారెడ్డిపేట

అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో డీఎంఎఫ్ నిధులు రూ.14లక్షలతో నిర్మిస్తున్న నూతన అంగవాడీ కేంద్రం భవన పనులను శనివారం పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా సర్పంచ్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, అంగన్‌వాడీ నూతన భవనాన్ని నిర్మించి పిల్లలకు పౌష్టికాహారం, విద్య అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తయితే అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీని నూతన భవనంలోకి మార్చుతామన్నారు. నాణ్యతతో పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు.

తోడేస్తూ.. తరలిస్తూ..

- అనుమతుల పేరిట మట్టి అక్రమ రవాణా
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- ప్రభుత్వ ఖజానాకు గండి
- పట్టించుకోని అధికారులు


మట్టిని తరలిస్తున్న దృశ్యం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు శివారులో మట్టి అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. అనుమతులు ఉన్నా.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. ప్రభుత్వ అవసరాలకు అనుమతులు తీసుకొని ప్రైవేట్‌గా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అటు అధికారులను మోసం చేస్తూ ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తున్నారు.

ప్రభుత్వ పనుల పేరిట..

సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు శివారులోని ఎద్దుగుట్ట సమీపం నుంచి ప్రభుత్వ పనుల కోసం కొందరు వ్యక్తులు మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. కానీ నేరుగా పర్మిషన్ తీసుకున్న దగ్గర మట్టి పోయకుండా మరో చోటకు తరలిస్తున్నారు. సిరిసిల్ల రెండో బైపాస్‌లో వెలసిన వెంచర్లకు మట్టిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ దందాపై పలువురు ప్రశ్నిస్తే.. ×ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నాం. మా ఇష్టం వచ్చినవారికి అమ్ముకుంటాం× అని సదరు వ్యక్తి సమాధానం ఇవ్వడం గమనార్హం. అంతే కాకుండా మట్టిని తోడుతున్న సమీపంలో ఉన్న రైతుల వ్యవసాయ భూముల హద్దుల్లోకి వస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరించడంతో మట్టి రవాణా అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది.

రాత్రివేళలోనూ ఆగని తరలింపు

అనుమతులు ఉన్నాయని రాత్రి వేళలో కూడా నిత్యం మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. స్థానిక గ్రామ ప్రయోజనాలకు మట్టిని తరలిస్తే అధికారులు అడ్డుకుంటున్నారని, అనుమతుల పేరిట అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టి తరలిస్తే ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇటీవలే రాత్రి వేళ టిప్పర్లతో రవాణా చేస్తే స్థానికులు అడ్డుకోగా, రెవెన్యూ అధికారులు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. అనుమతులు ఉన్నాయని తెలియడంతో వదిలిపెట్టినట్లు సమాచారం. ఈ విషయమై మైనింగ్ శాఖ అధికారులను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.


బైపాస్‌లో వెలసిన వెంచర్లలో మట్టికుప్పలు

ధర్మారంలో వాలీబాల్ టోర్నమెంట్

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో శనివారం ఫ్రెండ్లీ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. గ్రామానికి చెందిన అన్నబోయిన సురేశ్‌కుమార్ తన తల్లి పేరిట నిర్వహించిన ఈ పోటీల్లో 10 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగే ముగింపు పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీమ్ ఆర్గనైజర్ పెద్ది అభిషేక్, భరత్, మహిపాల్, అరుణ్, తరుణ్, రమేశ్, ప్రశాంత్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ఆనవాళ్లు కోల్పోయిన తూం

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో మానేరు ప్రాజెక్టు సబ్ కెనాల్ షట్టర్ ధ్వంసమైంది. కెనాల్ పక్క నుంచి రహదారి నిర్మాణంతో తూం మొత్తం మట్టితో నిండిపోయింది. తూం కింద ఉన్న ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. నీటిపారుదలశాఖ అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: వంశీకృష్ణ, ఏఈ, ఫోన్ నంబర్ 77022 08968

చిత్రం.. భళారే వి'చిత్రం'!

- ఒకే థియేటర్‌లో రెండు సినిమాలు
- మార్నింగ్ ఓ సినిమా.. మాట్నీ మరో సినిమా
- థియేటర్ల కొరతతో వింత పరిస్థితి


సిరిసిల్లలోని థియేటర్ నిండా ప్రేక్షకులు

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో సినీ అభిమానులకు వింత పరిస్థితి ఎదురైంది. ఒకే థియేటర్‌లో రెండు సినిమాలు ప్రదర్శిస్తున్నారు. నిజానికి కరీంనగర్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో మల్టీప్లెక్స్‌ల్లో రెండు, మూడు సినిమాలు వేయడం సహజం. కానీ సిరిసిల్లలో సినిమా థియేటర్లు లేక ఉన్న వాటిల్లోనే రెండు సినిమాలు వేస్తున్నారు. సిరిసిల్లలోని నటరాజ్ థియేటర్‌లో మార్నింగ్ షో 'వీరసింహారెడ్డి', మాట్నీ షోగా 'వాల్తేరు వీరయ్య' సినిమాలు ప్రదర్శిస్తున్నారు. ఒకప్పుడు సిరిసిల్లలో ఆరు థియేటర్లు ఉండేవి. కాలక్రమేన కాలగర్భంలో కలిసిపోగా రెండు థియేటర్లు మాత్రమే మిగిలాయి. సంక్రాంతి సందర్భంగా రెండు భారీ సినిమాలు విడుదల కావడంతో థియేటర్లు లేక ఇలా ఒకే దానిలో రెండు సినిమాలు ప్రదర్శిస్తున్నారు. మరో థియేటర్ విమల్‌లో వారసుడు సినిమా నడుస్తోంది. పోస్టర్ చూసి సినిమాకు వస్తే.. ఒక సినిమాకు బదులు మరో సినిమాను చూడాల్సి వస్తోందని ప్రేక్షకులు వాపోతున్నారు. ఏది ఏమైన సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చిత్రం.. భళారే విచిత్రంగా మారింది.

అలరించిన రంగవల్లులు

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువతులు


ముగ్గును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ


బహుమతులు అందజేస్తున్న ఎస్సై వెంకట్రాజం


బహుమతులు అందిస్తున్న ఎస్సై అభిలాష్

సిరిసిల్లఅర్బన్/బోయినపల్లి/వేములవాడఅర్బన్/కోనరావుపేట: సిరిసిల్ల పట్టణంలోని 30వ వార్డులో శ్రీ శివగణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు, కళాశాల విద్యార్థినులు పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దిడ్డి మాధవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. బోయినపల్లి మండలం గుండన్నపల్లి, బోయినపల్లి ముగ్గుల పోటీలు నిర్వహించారు. గుండన్నపల్లిలో విజేతలకు ఎస్సై పుల్లా అభిలాష్, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, సర్పంచు కొప్పుల లక్ష్మి బహుమతులు అందించారు. బోయినపల్లిలో సర్పంచు గుంటి లతశ్రీ బహుమతులు అందించారు. వేములవాడ మండలం చింతల్‌ఠాణాలో మా స్వచ్ఛంద సంస్థ సహకారంలో వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కల రాము ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. వేములవాడ టౌన్ ఎస్సై వెంకట్రాజం బహుమతులు అందజేశారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారు కేసీఆర్‌నగర్ కాలనీలో నిర్వహించిన పోటీల్లో 50 మంది మహిళలు, బాలికలు పాల్గొన్నారు. కోనరావుపేట మండలంలోని గ్రామాల్లో భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు తమ ఇళ్లముందు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి.

కల్యాణలక్ష్మీ చెక్కులు అందజేత

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం, రుద్రవరం, సంకెపల్లి, ఆరెపల్లి గ్రామాల్లోని లబ్ధిదారులకు శనివారం కల్యాణలక్ష్మీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ప్రజాప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు, సర్పంచులు కొండపల్లి వెంకటరమణారావు, ఉరడి రాంరెడ్డి, ఇటుకల నవీన రాజు, ఉరడి ప్రవీన్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణదేవరావు, బండారి శ్రీనివాస్, చిలివేణి మల్లేశం, రాము, కనకరాజు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్..

కోనరావుపేట: మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన కొలనూర్ మహిపాల్‌రెడ్డి, తడకమడ్ల కిరణ్‌కు సర్పంచ్ కాదాసు సంతోష్, ఉపసర్పంచ్ మహిపాల్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఎంపీటీసీ మల్లేశ్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, సాయికృష్ణ, కొలనూరు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోగాపూర్‌లో..

రుద్రంగి: చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో నిరు పేదలకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య నాయకులతో కలిసి పంపిణీ చేశారు.

నలుగురిపై వరకట్నం కేసు

ఎల్లారెడ్డిపేట: అదనపు వరకట్నం తీసుకురావాలని ఓ వివాహితను వేధింపులకు గురి చేసిన నలుగురు వ్యక్తులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటకు చెందిన గడ్డం జ్యోతిని వెంకటాపూర్‌కు చెందిన గడ్డం రవి ఇచ్చి 2021లో కట్నాకానుకలతో ఘనంగా వివాహం జరిపించారు. అయితే మరో రూ.2లక్షల అదనపు వరకట్నం తీసుకురావాలని భర్త రవి, అత్త మనేవ్వ, ఆడబిడ్డలు మమత, పద్మలు జ్యోతిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేశారు. ఇనుప రాడ్లతో ఆమెను గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ


పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లఅర్బన్: నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి 12వ వార్డులో చంద్రంపేట– కోనరావుపేట ప్రధాన రహదారి పునర్నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మట్లాడుతూ, సిరిసిల్ల–కోనారావుపేట మండలాన్ని కలిపే ప్రధాన రహదారి చంద్రంపేట వద్ద పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బపడుతున్నారన్నారు. ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి రూ.70 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించి, త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





మార్కెట్‌లో సంక్రాంతి సందడి

సంక్రాంతి పండుగ సందర్భంగా మార్కెట్‌లో సందడి నెలకొంది. ముగ్గుల పండుగ కాబట్టి మహిళలు వివిధ రకాల రంగుల కొనుగోళ్లపై ఆసక్తిచూపారు. అలాగే పూజా కార్యక్రమాల కోసం పువ్వులు ఇతర సామగ్రీ తీసుకెళ్లారు. పిల్లలు గాలిపటాలు కొని ఎగరేసేందుకు సిద్ధమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల